

4 లో

ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యం

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :194 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 11 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# ప్రధానిగా మోదీ సరికొత్త రికార్డు..

## అభినందనగా కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం



వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా మోదీ రికార్డు

ఈ విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన ప్రధాని

ఈ ఘనతపై ఢిల్లీలోని భారత్ మండపంలో ఎన్డీయే ప్రత్యేక సమావేశం

**న్యూఢిల్లీ:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన ఎన్నికైన నేతగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టం సందర్భంగా నేడు సమావేశమైన కేంద్ర కేబినెట్, ప్రధాని మోదీని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. కేబినెట్ సభ్యులంతా నిలబడి చప్పట్లతో ఆయనకు తమ గౌరవాన్ని తెలిపారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానిగా ఆయన 4,399 రోజులు పూర్తిచేసుకుని, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించారు. 1952లో దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలాన్ని ఈ పోలిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. 1947 నుంచి 1952 మధ్య నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. మరోవైపు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా పదవిలో ఉన్నప్పటికీ, ఆమె పాలన నిరంతరాయంగా సాగలేదు. దీంతో వరుసగా మూడుసార్లు (2014, 2019, 2024) గెలిచి, నిరంతరాయంగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా మోదీ నిలిచారు. ఈ చారిత్రక సందర్భాన్ని, అలాగే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకోవడానికి ఢిల్లీలో ఎన్డీయే కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఇవాళ సాయంత్రం భారత్ మండపంలో ఈ సమావేశం జరగనుంది. ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ఎన్డీయే కూడా ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా,

మిగతా 2లో...



# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

24 గంటల్లోనే చెప్పిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున చెక్కులు అందించిన మంత్రి

ఒక్కో కుటుంబానికి రూ. 1.72 కోట్ల వరకు ప్రయోజనాలు, ఉద్యోగం ఇస్తామన్న పవన్

ప్రమాద కారణాలపై కేంద్ర ఉక్కుశాఖ త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభం

రూ. 120 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపుతూనే ఉంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు అనే మరో ఉద్యోగి ఇవాళ ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో ప్లాంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మిగతా 2లో...

# ఉత్తర, దక్షిణ విభజన, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకతపై పవన్‌కల్యాణ్ స్పందన

ఉత్తర-దక్షిణ విభజన వాదం దేశానికి ప్రమాదకరమని పవన్ హెచ్చరిక

తొలిసారిగా ఏఎన్ఐకి ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు

రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టవద్దు

ఏపీకి రూ.7,707 కోట్లు కేటాయించిన కేంద్రానికి ధన్యవాదాలు

తాను తెలంగాణను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్న పవన్ కల్యాణ్

విభజన జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించినట్లు వెల్లడి

**అమరావతి, సింధూరదర్శిని:** ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు దేశ సమగ్రతకు అత్యంత ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇలాంటి విభజనవాద ధోరణులు దేశ శ్రేయస్సుకు ఏమాత్రం శ్రేయస్కరం కావని ఆయన స్పష్టం చేశారు. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కేవలం విభజన జరిగిన అశాస్త్రీయ విధానాన్ని మాత్రమే తప్పుబట్టానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తొలిసారిగా ఆయన ఢిల్లీలో ఏఎన్ఐ వార్తాసంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌తో నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలు, పరిపాలన, వ్యక్తిగత అంశాలతో పాటు పలు జాతీయ అంశాలపై ఆయన సుదీర్ఘంగా

మిగతా 2లో...





# అన్నా కాంటీన్‌లో మంత్రి నారాయణ సందడి

పేదలతో కలిసి భోజనం

గత పాలకుల శాడిజంతో పేదల కడుపు కొట్టారు

అన్నా కాంటీన్ల సంఖ్యను ఇంకా పెంచుతాం

తమిళనాడులో లేని విధానం ఏపీలోనే ఎందుకు?

గత ప్రభుత్వం పై మంత్రి నారాయణ నిప్పులు

మాపై కోపంతో 2.25 లక్షల మంది కడుపు కొట్టారు

నెల్లూరులో మంత్రి నారాయణ సంచలన వ్యాఖ్యలు

**నెల్లూరు( సింధూర దర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా;**
నెల్లూరు సిటీ లోని ఇందిరాభవన్ రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణఆకస్మిక తనిఖీ చేశారు..అక్కడ పేదలతో కలిసి స్వయంగా భోజనం చేసిన మంత్రి, వంటల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మిగతా 2లో...

# ఫ్యూచర్ సిటీకి తొలి అడుగు..

కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

హైదరాబాద్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని ప్రకటన

అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

చెరువుల ఆక్రమణలు తొలగించి 'లేక్ ఎకానమీ' అభివృద్ధి చేస్తామని వెల్లడి



**హైదరాబాద్, సింధూరదర్శిని:**
తెలంగాణాను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన

మిగతా 2లో...

# ఏపీ రాజధానిలో కీలక పరిణామం..

-అమరావతిలో రూ.1235 కోట్లతో కేంద్రం భారీ ప్రాజెక్ట్

-అమరావతిలో భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

-కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసాల కోసం రూ.1235 కోట్లు కేటాయింపు

-మొత్తం 11 టవర్లలో 1504 నివాస గృహాలు నిర్మించనున్న సీపీడబ్ల్యూడీ

-పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మాణం

-నిర్మాణ, నిర్వహణ దశల్లో స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు



**అమరావతి, సింధూరదర్శిని:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం భారీ నివాస సముదాయాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,234.91 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) చేపట్టనుంది. ఇప్పటికే ప్రీ-బిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం.

మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జీపీఆర్ఏ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11 నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్-II నుంచి టైప్-VI వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504 ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972 కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30 లక్షల చదరపు అడుగులుగా ఉంది.

ప్రాజెక్ట్ లక్ష్యాలు.. ప్రయోజనాలు

అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

మిగతా 2లో...

# ప్రధానిగా మోదీ సరికొత్త రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో పాటు ఎన్డీయే పాలిత 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, భాగస్వామ్య పక్షాల నాయకులు హాజరుకానున్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, కర్తవ్య పథ్, వందే భారత్ రైళ్లు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ఐఎన్‌ఎస్ విక్రాంత్, కశ్మీర్ రైల్ లింక్, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. కాగా, ఎన్డీయే సమావేశంలో కూటమి సాధించిన విజయాలు, భవిష్యత్ విధాన ప్రాధాన్యతలు, రాజకీయ వ్యూహాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. పాలనాపరమైన కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు, రాబోయే ఎన్నికల సవాళ్లపై దృష్టి సారించనున్నారు.

# ఫ్యూచర్ సిటీకి తొలి అడుగు

(మొదటిపేజీ తరువాయి)

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం 150 రోజుల రికార్డు సమయంలో ఫ్యూచర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, వేగానికి నిదర్శనమని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ విస్తరించడం వల్లే ప్రపంచ పటంలో నగరానికి ప్రత్యేక స్థానం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తిరస్కరించిన ఆ పార్టీ, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే రాజకీయంగా మరింత కనుమరుగవుతుందని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రహదారులు జలమయం కావడాన్ని ప్రస్తావిస్తూ.. చెరువులు, నీటి వనరులు ఆక్రమణలే ఇందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూకబ్జాలను తొలగించి, చెరువులను పునరుద్ధరించడం ద్వారా 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ఏడాది డిసెంబర్‌లో మరో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు బంగారం ధరను మించిపోయాయని పేర్కొన్నారు. ఆనాటి నిజాం రాజులు, కులీకుతుబ్‌షాలు హైదరాబాద్ నగరాన్ని అనేక పర్యాయాలు విస్తరించారని గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తోందని, ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ముఖ్యమంత్రి విమర్శించారు.

# అన్నా కాంటీన్‌లో మంత్రి నారాయణ సందడి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత పాలకుల శాడిజంతో 2.25 లక్షల మంది పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. పక్క రాష్ట్రం తమిళనాడులో ప్రభుత్వం మారినా అమ్మా క్యాంటీన్లు నడుపుతుంటే, ఇక్కడ మాత్రం కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 270 అన్నా కాంటీన్లను పునఃప్రారంభించి, కేవలం 5 లకే అత్యంత నాణ్యమైన భోజనం అందిస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత మెరుగుపరిచి, సీఎం చంద్రబాబు నాయుడు హామీ మేరకు అన్నా కాంటీన్ల సంఖ్యను భారీగా పెంచుతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్ మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నాయకులు రామకృష్ణ ,పోకల రవి,అజయ్,స్థానిక టిడిపి ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర, దక్షిణ విభజన, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకతపై పవన్ కల్యాణ్ స్పందన

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. సుమారు 84 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో పవన్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులు ఒక ప్రాంతాన్ని మరో ప్రాంతంతో పోల్చి ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడం సరికాదన్నారు. గతంలో కొందరు నేతలు తనను హైదరాబాద్ రావొద్దని అన్నారని గుర్తుచేస్తూ, అదే తర్కాన్ని పాటిస్తే రాహుల్ గాంధీ వంటి జాతీయ నాయకులను కూడా కొన్ని ప్రాంతాలకు వెళ్లవద్దని చెప్పాల్సి ఉంటుందని, ఇటువంటి సంకుచిత రాజకీయాలు దేశానికి తగవని హితవు పలికారు. 570కి పైగా సంస్థానాలను విలీనం చేసి భారతదేశాన్ని పటిష్టం చేసిన చరిత్రను స్మరిస్తూ, విభజనవాదం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,707.21 కోట్లు కేటాయించినందుకు పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు అందిన నిధుల్లో ఇది మూడో అత్యధిక కేటాయింపు అని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని పవన్ కల్యాణ్ తెలిపారు. తెలంగాణలో కూడా తమ పార్టీ పోటీ చేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారని వెల్లడించారు. ఈ దేశంలో పౌరులు ఎవరైనా, ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా తెలంగాణపై తన భవిష్యత్ ప్రణాళికలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఉచిత పథకాల ప్రభావం, భాషా రాజకీయాలు, ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన వంటి అనేక అంశాలపై పవన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్డీయే సమావేశాల నిమిత్తం ఢిల్లీలో ఉన్న తరుణంలో ఆయన ఈ పాడ్‌కాస్ట్‌లో పాల్గొనడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలు వేగంగా అమలవుతున్నాయి. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు గడవకముందే మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల చొప్పున చెక్కులను స్వయంగా అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీనికి అదనంగా రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలిపి రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి రూ. 45 లక్షలు అందుతాయని వివరించారు. మృతుడు శాశ్వత ఉద్యోగి అయినా, ఒప్పంద ఉద్యోగి అయినా వారి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లల చదువుల బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ఉక్కుశాఖ ఇప్పటికే త్రిసభ్య కమిటీని నియమించింది. బొకారో సెయిల్ డైరెక్టర్ ప్రియరంజన్ నేతృత్వంలోని ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. మరో రెండు రోజుల పాటు విశాఖలోనే ఉండి ప్రమాదానికి గల కారణాలను శోధించనుంది. ఈ దుర్ఘటన కారణంగా స్టీల్‌ప్లాంట్‌కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రెండు రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ. 100 కోట్లు, యంత్ర పరికరాలు దెబ్బతినడం వల్ల మరో రూ. 20 కోట్లు, మొత్తంగా రూ. 120 కోట్లకు పైగా నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఎంఎస్-1లోని ఒక మిషన్ ఆగిపోగా, మిగిలిన ఐదు మిషన్లతో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# సామాజిక న్యాయం - సమగ్ర సాధికారత దిశగా చారిత్రాత్మక అడుగులు

**విద్య, ఉపాధి, సంక్షేమం, దివ్యాంగుల అభివృద్ధి, గ్రామ-వార్డు పరిపాలనలో విశిష్ట పురోగతి**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మాత్యులు డా. డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి**



అమరావతి, సింధూరదర్శిని: సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల సమగ్ర సాధికారత అనే మహత్తర లక్ష్యాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పరిపాలనకు కొత్త దిశను నిర్దేశిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు ꠰ వృద్ధుల సంక్షేమం, స్వర్ణ గ్రామం ꠰ వార్డు శాఖా మాత్యులు డా. డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను శాశ్వతంగా తొలగించాలంటే విద్య, నైపుణ్యం, ఉపాధి, ఆరోగ్యం, గౌరవప్రద జీవనం అనే అంశాలను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ఆ దిశగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, హాస్టళ్లు, స్టడీ సర్కిల్స్, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ పథకాలు, స్వర్ణగ్రామం ꠰ వార్డు వ్యవస్థల ద్వారా అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు.

ఎస్సీ విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తూ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ.1,543.17 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి 5.40 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామని మంత్రి వెల్లడించారు. అలాగే ప్రీ మెట్రిక్ విద్యార్థులకు "తల్లి కి వందనం" కార్యక్రమం ద్వారా రూ.326.74 కోట్లను 2.51 లక్షల మందికి అందజేయడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా, కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ వ్యవస్థలోనే అందజేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. నీట్, జేఈఈ, సివిల్స్, గ్రూప్స్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన కోచింగ్‌ను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

డీఎస్సీ కోచింగ్ ద్వారా 2,000 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 331 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లుగా అనేక మంది ఉద్యోగాలు సాధించడం ద్వారా ప్రభుత్వ కోచింగ్ వ్యవస్థ సమర్థతను నిరూపించిందన్నారు.

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని మంత్రి తెలిపారు. టెన్త్‌లో 85.32శాతం, ఇంటర్మీడియట్ లో 72.30 శాతం ఫలితాలు నమోదయ్యాయని చెప్పారు. ప్రత్యేకంగా గురుకులాల్లో టెన్త్‌లో 89 శాతం, ఇంటర్మీడియట్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు.

ఇంటర్మీడియట్‌లో 950కు పైగా మార్కులు 45 మంది విద్యార్థులు సాధించగా, టెన్త్లో 591 మార్కులు సాధించిన విద్యార్థి హాస్టల్ నుంచే రావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు, ప్రత్యేక సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లోనూ విద్యార్థులు రాణించేలా నాలుగు ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

**హాస్టళ్లలో సమగ్ర మౌలిక వసతుల కల్పన...**

విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన, గౌరవప్రద వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రూ.104.96 కోట్ల వ్యయంతో హాస్టళ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టి 774 హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచామని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో RO ప్లాంట్లు, కొత్త మెట్రన్స్, పరిశుభ్రత నిర్వహణకు ప్రత్యేక శానిటేషన్ వ్యవస్థలు, అవుట్‌సోర్సింగ్ హౌస్‌కీపింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 989 హాస్టళ్లలో రూ.19.80 కోట్లతో ఆధారిత సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే మెకనైజ్డ్ కిచెన్లను ప్రవేశపెట్టి పరిశుభ్రమైన, పోషకాహార భోజనం అందిస్తున్నామని చెప్పారు. వంట సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

**విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక కార్యాచరణ...**

ప్రతి హాస్టల్, గురుకులంలో హెల్త్ సూపర్‌వైజర్లు, నర్సింగ్ సిబ్బందిని నియమించి విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులు కుటుంబ సభ్యుల్లా ఉండేలా వార్డెన్లు, సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు.

దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా 30 లక్షల మందికి సేవలు అందించామని, రూ.13 కోట్లకు పైగా నిధులు కేటాయించామని తెలిపారు. 52,263 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశామని చెప్పారు. 329 దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించామని, త్వరలో నియామకాలు పూర్తి చేస్తామని తెలిపారు.

దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000లకు పెంచిన ప్రభుత్వం, వారికి విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ ముందంజలో ఉందన్నారు. ప్రతి కలెక్టరేట్‌లో దివ్యాంగులకు అనుకూల సౌకర్యాలు, ప్రత్యేక లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి వారికి గౌరవప్రద జీవనోపాధి కల్పించే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**స్వర్ణ గ్రామం, వార్డు వ్యవస్థ**

**- ప్రజలకు చేరువైన పరిపాలన.**

స్వర్ణ గ్రామం ꠰ వార్డు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. 1.68 కోట్ల ఇళ్ల మ్యాపింగ్, 1.71 కోట్ల కుటుంబాల ఈ-కేవైసీ పూర్తి చేశామని వెల్లడించారు. డిజిలాకర్ ద్వారా ప్రతి పౌరుడు తన ముఖ్య పత్రాలను డిజిటల్‌గా భద్రపరుచుకునే అవకాశం కల్పించామని తెలిపారు. గ్రామ, వార్డు సిబ్బందికి ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో రికార్డు...**

2024-25 సంవత్సరానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.26,044 కోట్ల కేటాయింపు చేశామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇది 10 శాతం అధికమని పేర్కొన్నారు. కేవలం నిధుల కేటాయింపే కాకుండా వాటి వినియోగంలోనూ రికార్డు స్థాయి పురోగతి సాధించామని తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీ మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం ఉపాధి పథకాలు, సబ్సిడీ రుణాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

తమ ప్రభుత్వం సంక్షేమాన్ని కేవలం పథకాల పంపిణీకి మాత్రమే పరిమితం చేయడం లేదన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, గౌరవప్రద జీవనం కల్పించడం ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ప్రతి బలహీన వర్గ కుటుంబం జీవితంలో స్థిరమైన మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్స్‌జెండర్ కుటుంబం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందేలా నిరంతరం కృషి కొనసాగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరే ఎమ్.ఎమ్.నాయక్, రాష్ట్ర స్త్రీ శిశు, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి.లావణ్య వేణి, ఏ.పి. గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, స్వర్ణ గ్రామం ꠰ స్వర్ణ వార్డు శాఖ సంచాలకులు శివ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు కె.సునీల్ రాజ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఏపీ రాజధానిలో కీలక పరిణామం..

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

పర్యావరణ హిత నిర్మాణం.. సకల సౌకర్యాలు

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4-స్టార్ గ్రీహా (జీఆర్ఐహెచ్ఏ) రేటింగ్ సాధించేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఏటీఎం, పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్ కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్ హౌస్ వంటి అన్ని రకాల పౌర, సామాజిక



సదుపాయాలు ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.



## ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు : టిడిపి నాయకులు

గూడూరు ( సింధూర దర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా; తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అయినటువంటి స్వర్గీయ నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఆనందంగా జరుపుకుంటున్నామని గూడూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు పులిని శ్రీనివాసులు అన్నారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో హిందూపురం ఎమ్మెల్యే మరియు ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ బాలకృష్ణ అభిమాన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో రాణిస్తూ తండ్రికి తగ్గ తనయుడుగా కీర్తి గడించడంతోపాటు రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజలకు సేవ చేస్తూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని అదేవిధంగా వైద్య రంగంలో ఆయన ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నేటితరం ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి , ఇజ్రాయిల్ కుమార్, రహీం, పిల్లిళ్ల శ్రీనివాసులు నరసింహనాయుడు, వేముల సునీల్, శివ, అమరయ్య, పార్వతయ్య , అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జూట్ బ్యాగుల తయారీపై మహిళలకు శిక్షణ

### మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి



గూడూరు( సింధూర దర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా ; స్వయం ఉపాధి పథకం కింద ఆంధ్ర మహిళ మండలి కార్యాలయంలో జూడ్ బ్యాగుల పై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి వెల్లడించారు.గూడూరు పట్టణంలో ఆంధ్రా మహిళా మండలి సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మహిళా మండలీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ వారు స్వయం ఉపాధి పథకం కింద మహిళా మండలికి జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ ప్రాజెక్టును ఇవ్వడం జరిగిందని జ్యూట్ బ్యాగుల తయారీపై ఆసక్తిగల మహిళలు మహిళా మండలి వారిని సంప్రదించి దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశం లో మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం పంపిణీ




గూడూరు (సింధూరదర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు మేగా.శ్యామ్ సుందర్ రెడ్డి కుమార్తె మేగా శ్యామ్ రెడ్డి జన్మదినం సందర్భంగా రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు భోజన వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెస్ట్ క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. మేగా శ్యామ్ సుందర్ రెడ్డి ఎంతో మంచి మనసుతో వారి కుమార్తె మేఘ.శ్యామ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వృద్ధాశ్రమం నందు జరుపుకోవడం అభినందనీయమని,ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం సంతోషమని,వారు మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు .మేగా శ్యామ్ రెడ్డికి రోటరీ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మేఘ శ్యామసుందర్ రెడ్డి దంపతులు,వాసు గౌడ్, క్లబ్ సెక్రటరీ రాఘవ రెడ్డి,రొటేరియన్లు కొత్తపల్లి సనత్ రెడ్డి, కృష్ణంరాజు, సిద్ధారెడ్డి, కోటా కృష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పై రాష్ట్ర కార్యదర్శి సమావేశం

కందుకూరు సింధూర దర్శిని: కందుకూరు నియోజకవర్గం లో ఎస్ ఐ ఆర్ పై బిఎల్ఏలతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు.



# ప్రజా ప్రతినిధుల సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి



**పెండింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు**

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**ప్రశాంతంగా నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం**

నెల్లూరు (సింధూరదర్శిని ) 10 జూన్ నెల్లూరు జిల్లా; జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మత్తులు, సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, సిఇవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. తొలుత సమావేశంలో పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సభలో చర్చించారు. ప్రధానంగా పలు ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్లు మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సచివాలయాల బిల్డింగులు అసంపూర్తిగా ఉన్నాయని, బిల్లులు కూడా పెండింగ్ లో ఉన్నాయని, నాడు నేడు కింద పాఠశాలలో చేపట్టిన పనులు కూడా మధ్యలో నిలిచిపోయి ఉన్నాయని పలువురు సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. తమకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉందని... ఈ సమయంలోగా తాము ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు జడ్పిటిసిలు కోరారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యకేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు.

**సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు**

ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశం సజావుగా జరిగిందని తెలిపారు. మరో మూడు నెలల్లో జిల్లా ప్రజా పరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగుస్తుందని, బహుశా మరొక సమావేశం జరిగే అవకాశం ఉందని, మొట్టమొదటి జిల్లా పరిషత్ సమావేశంలో తాను పాల్గొన్నానని, చివరి సమావేశంలో కూడా తాను పాల్గొని జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ చేసిన సేవలను గుర్తు చేసుకోవడంలో పాలు పంచుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, కొన్ని సమస్యలపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రధానంగా రహదారుల మరమ్మత్తులపై సభ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయాలను పూర్తిస్థాయిలో నిర్మించడం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, పాఠశాలలు మొదలైన అంశాలపై కూడా చర్చించామని, వీటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

**అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందన్నారు.కోవూరు నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు భోజనం తినడానికి సరైన వసతులు లేవన్నారు.పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో చాలా చోట్ల వంట గదులు భోజనశాల లను సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించేందుకు ప్రణా ళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బాధ్యతగా తీసుకొని చేపట్టాలన్నారు. వంటలు వడ్డించేటప్పుడు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టీ కాలనీలు ఎక్కువ ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్, స్మశానాలు గడిచిన 24నెలలుగా చాలా ప్రాంతాల్లో అభివృద్ధి చేసుకుంటు న్నామన్నారు. ఇంకా చాలా వరకు చేయాల్సి ఉందన్నారు... వాటికి సంబంధించిన పనులకు జడ్పీ నిధులు మంజూరు చేయాలని కోరారు.

**సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను ఆయాశాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ ఈ కోటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయభాస్కర్, డిఇఓ ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, డి ఆర్ డి ఎ పి డి నాగరాజు కుమారి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలి

### ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు డి పి పోలయ్య డిమాండ్



గూడూరు (సింధూరదర్శిని)10 జూన్ నెల్లూరు జిల్లా; విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అత్యంత విషాదకరమని, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టియు నెల్లూరు జిల్లా అధ్యక్షులు డి పి. పోలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సైదాపురంలోని ఐ ఎఫ్ టి యు కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే గాయపడిన కార్మికులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించి, పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఘటనపై న్యాయ విచారణ జరిపి నివేదికను ప్రజలకు వెల్లడించాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడం ప్రభుత్వంతో పాటు యాజమాన్యాల బాధ్యత అని పేర్కొన్న ఆయన, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐ ఎఫ్ టి యు నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు కె. చంగల్‌రావు,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు డి నవ కోటి,ఎం అనిల్,ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ బిమమత,నాయకులు వెంకటరమణయ్య, అన్నజయ్య లు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

### మయూరి శ్యామ్ యాదవ్ వారి సతీమణి మహేశ్వరి

గూడూరు (సింధూర దర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా; శ్రీకృష్ణ సేవా సమితి ఫౌండర్ మరియు మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో పట్టణంలోని గమల్లపాలెం ప్రాంతంలో ఉన్న ఓం సాయిరాం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు క్రమం తప్పకుండా జరిగే అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని కేర్ టేకర్ కళ్యాణి పాల్గొన్నారు.





## నూతన క్రైస్తవ ప్రార్ధన మందిరం ప్రారంభం

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు ( సింధూర దర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా ; భారతదేశంలో అన్ని మతాలకు సరియైన ఆదరణ ఉందని అయితే ఇటీవల కొంతమంది బలవంతంగా మతమార్పిడులకు పాల్పడటం అవాంఛనీయమని ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకాకుండా ఉండాలని ఆశిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు . గూడూరు పట్టణ పరిధిలోని గాంధీ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రైస్తవ ప్రార్ధన మందిరం ను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు .గాంధీనగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రైస్తవ ప్రార్ధనమందిరంలో నిర్వహించిన ప్రార్ధనలలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు . అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మందిరం ఏర్పాటు చేసుకునేందుకు తనను కొందరు క్రిస్టియన్లు సంప్రదించారని వారికి అధికారుల సహకారంతో స్థలం కేటాయించడం జరిగిందని తెలిపారు . అయితే ప్రతి ఒక్క మతం వారు మిగిలిన మతాల వారిని గౌరవించడం మన సంప్రదాయమని దానిని కొనసాగించాలని సూచించారు. ఇటీవల మన గూడూరు పట్టణంలో ఒక దేవస్థానానికి సంబంధించిన కొట్టును బాడుగకు తీసుకున్న వ్యక్తి మతం విషయంలో కొంత ఇబ్బందులు తలెత్తేయని ఇలాంటివి పునరావృతం కాకూడదని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు , క్రిస్టియన్ పెద్దలు , యేసుపాక పెంచలయ్య, సురేంద్ర, వాటం బెట్టి శివకుమార్ , తదితరులు పాల్గొన్నారు.

# క్రైం న్యూస్



## ఘరానా దొంగల ముఠా అరెస్ట్

### 10 లక్షలు విలువ గల చోరీ సొత్తు స్వాధీనం

నెల్లూరు( సింధూరదర్శిని) 10 జూన్ నెల్లూరుజిల్లా; నెల్లూరు నగరంలోని పెద్దబజార్ ప్రాంతంలో జరిగిన ఇంటి చోరీ కేసును చిన్నబజార్ పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకొని, చోరీకి గురైన సుమారు 145.300 గ్రాముల సుమారు 10 లక్షలు విలువ గల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.తేదీ 02.06.2026 న ఫిర్యాదుదారు షేక్ అజ్మత్ తన నివాసానికి తిరిగి వచ్చి చూడగా, ఇంటిలోని బీరువా మరియు లాకర్ తెరిచి ఉండటంతో పాటు అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో Cr No.108/2026 u/sec 305(a) బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలు మేరకు అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనలుతో, నెల్లూరు టౌన్, పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా, తేదీ 09.06.2026న పెద్దబజార్, డైకస్ రోడ్ సెంటర్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద ఇద్దరు బాల నేరస్తులతో పాటు షేక్ ఇర్ఫాన్ (19) మరియు మొహమ్మద్ ఆబిద్ (20) లను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుండి చోరీకి గురైన 145 300 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన చిన్నబజార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్ఐలు రజాక్, అయ్యప్ప మరియు వారి క్రైమ్ సిబ్బందిని జిల్లా ఇంచార్జి ఎస్పీ మరియు టౌన్ అభినందించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గూడూరు (సింధూరదర్శిని) 10 జూన్ నెల్లూరు జిల్లా; గుర్తు తెలియని మృతదేహం లభ్యం. పోలీసుల వివరాల మేరకు పట్టణంలోని వన్ టౌన్ పరిధిలోని సొసైటీ ఏరియా దగ్గరలో గూడూరు చెరువు నందు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిసినచో గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించగలరని తెలిపారు.

## ఆ చిట్టీ ఇచ్చింది మీ వాళ్లే

### మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై బీజేపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

### మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు షాక్

### మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

### ఆమెపై కేసులు ఉన్నాయనే విషయాన్ని టీకాంగ్రెస్ నేతలే లీక్ చేశారన్న విజయ్‌వర్గీయ

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ అగ్రనేతలు ఢిల్లీలోని ఈసీ కార్యాలయం ముందు బైఠాయించగా... తమకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే, ఈ హైడ్రామా నడుస్తున్న తరుణంలో మధ్యప్రదేశ్ బీజేపీ కీలక మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ ఒక పొలిటికల్ బాంబు పేల్చారు. మీడియాతో మాట్లాడిన మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ.. “అసలు మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు ఉన్నాయనే విషయం మాకు ముందే తెలియదు. మాకు ఆ సమాచారం ఇచ్చింది, అక్కడి నుండి చిట్టీ పంపింది స్వయంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలే” అని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేసిన ఆయన.. సొంత పార్టీ నేతలే ఆమెపై ఉన్న కేసుల వివరాలను లీక్ చేశారంటే, ఆ పార్టీ అంతర్గత వ్యవహారాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ప్రజలకే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ లో కలకలం రేపుతున్నాయి.








# స్నాతకోత్సవం జ్ఞానం పట్టుదల, విజయాల వేడుక

- -డ్రోన్ టెక్నాలజీ, నానో శాటిలైట్ పరిశోధన - ఎస్ వి యు లో కొత్త శిఖరాలు
- -డాక్టరేట్ గ్రహీతలకు అభినందనలు - జాతీయ అభివృద్ధికి వారి సేవలకు గుర్తింపు
- -ఎస్ వి యు- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యా, పరిశోధనలో నిరంతర విజయాలు సాధించాలని ఆకాంక్ష
- -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ - 1954 నుండి విద్యా, పరిశోధన, సామాజిక అభివృద్ధిలో విశేష సేవలు అందించిన ఎస్ వి యు
- -జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టిన ఎస్ వి యు
- -ఎస్ వి యు యూనివర్సిటీ వి సి టాటా నరసింగారావు - ఎస్ వి యు- సృజనాత్మకత, జ్ఞానం, ఆవిష్కరణలకు కేంద్రం
- -దేశాభివృద్ధి, మానవాళి శ్రేయస్సు కోసం విద్యార్థుల కృషి తప్పనిసరి - ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్
- -ఎస్వీ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి (సింధూరదర్శిని) 10 జూన్ తిరుపతిజిల్లా; విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం, పట్టుదల మరియు నిబద్ధత ఫలితమే డిగ్రీ సాధించడానికి ప్రధాన కారణమని, స్నాతకోత్సవం కేవలం ఒక ఉత్సవ కార్యక్రమం మాత్రమే కాదని, జ్ఞానం, పట్టుదల, క్రమశిక్షణ, ఆశయాలు మరియు విజయాల వేడుక అని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎస్. వి. ఆడిటోరియం నందు నిర్వహించిన 63 నుండి 68 వ ఉమ్మడి స్నాత కోత్సవం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పాల్గొని విద్యార్థులకు పథకాల ప్రధానంతో పాటు డిగ్రీ లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విసి టాటా నరసింగారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రొఫెసర్ లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆచార్య అజయ్ కుమార్ సూద్, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారులు, డాక్టర్ సి.మాండే, భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షులు, శాస్త్రీయ మరియు పారిశ్రామిక పరిశోధన మండలి (సియస్.ఐ. ఆర్.) మాజీ డైరెక్టర్ జనరల్, డాక్టర్ కృష్ణ యం.ఎల్ల, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, భారత బయోటెక్ ఇంటర్నేషనల్ లకు గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్లు ప్రధానం చేశారు. వీరితో పాటు తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ఎస్వీ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఎస్వీ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో “ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ టెనెంట్ ఫార్మర్స్: ఎ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్” (చిత్తూరు జిల్లాలోని కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు) అనే కీలకమైన అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ స్నాతకోత్సవంలో 502 మంది విద్యార్థులు బంగారు పథకాలు, 260 మంది ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. మొత్తం 2713 మంది విద్యార్థులు నేరుగా,719మంది హాజరు మినహాయంపు పద్ధతిలో, 12,141 మంది ముందస్తు విధానం ద్వారా పొందారన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 1954లో స్థాపించబడినప్పటి నుంచి భారతదేశంలో ఉన్నత విద్యా, పరిశోధనా రంగాలలో ప్రముఖ విద్యా సంస్థలలో ఒకటైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో నిర్వహిస్తున్న 63వ నుండి 68వ ఉమ్మడి వార్షిక స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించడం గౌరవకరమైన విశేష అవకాశంగా భావిస్తున్నానన్నారు. స్నాతకోత్సవం కేవలం ఒక ఉత్సవ కార్యక్రమం మాత్రమే కాదని, జ్ఞానం, పట్టుదల, క్రమశిక్షణ, ఆశయాలు మరియు విజయాల వేడుక అన్నారు. యువ పట్టభద్రుల జీవితంలో ఒక ముఖ్యమైన దశ విజయవంతంగా పూర్తి కావడాన్ని, అలాగే అవకాశాలు, బాధ్యతలు మరియు సమాజ సేవతో నిండిన ఒక కొత్త ప్రయాణానికి నాంది పలుకుతుందన్నారు. ఈ చిరస్మరణీయ సందర్భంలో, విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ, పతకం మరియు పురస్కారం అందుకుంటున్న ప్రతి విద్యార్థికి, పరిశోధక విద్యార్థికి నేను అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం, పట్టుదల మరియు నిబద్ధత ఫలితమే డిగ్రీ సాధించడానికి ప్రధాన కారణం అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు మార్గదర్శకుల త్యాగాలు, ప్రోత్సాహం, అచంచలమైన మద్దతును ప్రతిబింబిస్తాయన్నారు. తమ పిల్లలకు సాధ్యమైనంత ఉత్తమ విద్యను అందించడానికి తమ కష్టార్జితాన్ని వెచ్చించి, సొంత జీవితాలను త్యాగాలు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది నిజంగా గర్వించదగిన రోజన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి, విలువలను పెంపొందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపక బృందం, పరిశోధన మార్గదర్శకులు, అధికారులు మరియు సిబ్బందిని ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు.భారతదేశ చరిత్రలో ఒక పరివర్తన కాలంలో ప్రస్తుత విద్యార్థులు పట్టభద్రులవుతున్నారని, నేడు భారతదేశం అద్భుతమైన అభివృద్ధి మరియు ప్రపంచ గుర్తింపు దిశగా ఆత్మవిశ్వాసంతో పయనిస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా దేశం ఆవిర్భవించి, ప్రపంచ విజ్ఞాన మరియు ఆవిష్కరణల కేంద్రంగా మారే దిశగా వేగంగా పురోగమిస్తోందన్నారు. భారతీయ మూలాలు కలిగిన ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, వైద్యం, పరిశోధన, పాలన, పరిశ్రమల రంగాల్లో అసాధారణ సేవలు అందిస్తున్నారన్నారు. ప్రపంచంలోని అనేక ప్రముఖ బహుళజాతి సంస్థలకు భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులే ముఖ్య కార్యనిర్వాహక అధికారులుగా (సీఈఓలుగా) నాయకత్వం వహిస్తున్నారన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద సంస్థలలో కొన్నింటిని సమర్థవంతంగా నడిపిస్తూ, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు మరియు వ్యూహాత్మక అభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. ప్రపంచ దృష్టిలో భారతదేశం పట్ల ఉన్న అభిప్రాయం గణనీయంగా మారిందని, భారత దేశ యువతగా కేవలం భవిష్యత్ ఉద్యోగులు మాత్రమే కాకుండా భవిష్యత్ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పరిశోధకులు మరియు దేశ నిర్మాణకర్తలు కావాలన్నారు. భారతదేశం తన జనాభా ప్రయోజనాన్ని ఎంత సమర్థవంతంగా వినియోగించుకోగలదన్నది విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలు మరియు విలువల ద్వారా యువతను ఉత్పాదక మానవ వనరులుగా ఎలా తీర్చిదిద్దుతామనే అంశాల పై ఆధారపడి ఉంటుందన్నారు. తిరుపతి వంటి ఆధ్యాత్మిక శోభతో కూడిన ప్రశాంతమైన క్షేత్రంలో నెలకొల్పబడిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యొక్క విశాలమైన ప్రాంగణం, గొప్ప నాయకులైన టంగుటూరి ప్రకాశం పంతులు (మద్రాసు ప్రెసిడెన్సీ ప్రీమియర్ మరియు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి) మరియు నీలం సంజీవ రెడ్డి (భారతదేశ ఆరవ రాష్ట్రపతి) వంటి వారి దూరదృష్టికి మరియు వివేకానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. రాయలసీమ,ఇతర ప్రాంతాల ప్రజల విద్యాపరమైన ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో వారు ఈ సంస్థను రూపొందించారన్నారు. జ్ఞానమే వివేకం అనే విశ్వవిద్యాలయ అధికారిక ధ్యేయ వాక్యం, జ్ఞాన సముపార్జన మరియు అత్యుత్తమ ప్రమాణాల సాధనలో తరతరాలుగా విద్యార్థులకు మరియు విద్వాంసులకు మార్గనిర్దేశం చేస్తూనే ఉందని, గత ఏడు దశాబ్దాలుగా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఒక ప్రముఖ విద్యాసంస్థగా అంచెలంచెలుగా ఎదుగుతూ గొప్ప స్థాయికి చేరుకుందన్నారు. ఉన్నత విద్యా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ‘రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్’ కింద లభించిన అవకాశాలను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సమర్థవంతంగా వినియోగించుకుంటున్నందుకు నేను ప్రత్యేకంగా సంతోషిస్తున్నానన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, విజ్ఞానశాస్త్రం మరియు సాంకేతికతలోని సరికొత్త మరియు అభివృద్ధి చెందుతున్న రంగాలలో అనేక సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేస్తోందని ఇందులో భాగంగా మైక్రో మరియు నానో శాటిలైట్ టెక్నాలజీ, భూ విజ్ఞానశాస్త్రం మరియు వాతావరణ పరిశోధన, పదార్థ శాస్త్రం మరియు నానోటెక్నాలజీ, వైరస్ లైక్ పార్టికల్ టెక్నాలజీ, మూలికా ఔషధ పరిశోధన, మానసిక మరియు జీవశాస్త్రాలు, జలవనరుల నిర్వహణ, బయో-ఎనర్జీ ఇన్నోవేషన్ అంశాలను కలిగి ఉందన్నారు. ఈ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, సమాజ అభివృద్ధి కోసం అంతర్విషయ పరిశోధన, అధునాతన ప్రయోగాలు, శాస్త్రీయ సహకారం మరియు సాంకేతికత ఆధారిత పరిష్కారాలను బలోపేతం చేస్తాయన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సాధించిన మరో విశేషమైన విజయం డ్రోన్ టెక్నాలజీ అని, డ్రోన్ పైలట్ శిక్షణ కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విశ్వవిద్యాలయానికి రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ హోదాను మంజూరు చేసిందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నానన్నారు. ఏరోస్పేస్ డ్రోన్ టెక్నాలజీ పరిశ్రమల సహకారంతో, విశ్వవిద్యాలయం డ్రోన్ టెక్నాలజీస్ కోసం ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని స్థాపించి, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించిందన్నారు. ఈ సేవను పోలీస్ ఎన్సిసి సిబ్బందికి మరియు యువతకు కూడా విస్తరించాలని విశ్వవిద్యాలయం యోచిస్తోందన్నారు. డిజిటల్ విద్యా విధానంతో సాంకేతికత ఆధారిత విద్య, ఉపాధ్యాయులు బోధించే మరియు విద్యార్థులు నేర్చుకునే విధానాన్ని మారుస్తున్నాయన్నారు. అదే సమయంలో, విద్య విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, నైతికత, కరుణ మరియు సామాజిక బాధ్యతలను పెంపొందించాల న్నారు. విద్యా ప్రణాళికలు చైతన్యవంతంగా, ప్రపంచవ్యాప్తంగా పోటీపడే విధంగా మరియు పరిశ్రమల ఆధారితంగా ఉండాలి. విద్యార్థులలో ఉపాధి, ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడానికి విశ్వవిద్యాలయాలు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు మరియు స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలతో బలమైన సంబంధాలను ఏర్పరచుకోవాలన్నారు. ఎస్ వి విశ్వవిద్యాలయ పట్టభద్రులుగా విద్యార్థులు ఆర్జించిన జ్ఞానాన్ని సమాజ మరియు మానవాళి శ్రేయస్సు కోసం వినియోగించాల్సిన గొప్ప బాధ్యత ఉందన్నారు. గొప్ప శాస్త్రవేత్త మరియు భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం అన్నట్లుగా కల అంటే నిద్రలో వచ్చేది కాదని అది నిద్రపోనివ్వనిదన్నారు. ప్రతి విద్యార్థి ధైర్యంగా కలలు కాణాలని, చిత్తశుద్ధితో పని చేయాలని, నిస్వార్థంగా సేవ చేయాలన్నారు. స్నాతకోత్సవంలో డాక్టరేట్ (హానోరిస్ కాసా) అందుకున్న ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డాక్టర్ కృష్ణ ఎల్లా మరియు డాక్టర్ శేఖర్ సి.మాండేలకు నేను అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. విజ్ఞానశాస్త్రం, ఆరోగ్య సంరక్షణ, పరిశోధన, ఆవిష్కరణ మరియు జాతీయ అభివృద్ధికి వారు చేసిన సేవలకు ఇది ఒక గుర్తింపన్నారు. అంకితభావం, పట్టుదల మరియు శ్రేష్ఠత సమాజానికి, దేశానికి ఏ విధంగా అర్థవంతంగా దోహదపడగలవో వారి విజయాలు నిరూపిస్తున్నాయన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యా నైపుణ్యం, ఆవిష్కరణ, పరిశోధనలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలతో నిరంతర విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానన్నారు.

# 'డైమండ్ క్యాపిటల్' అని భారత్‌లో ఏ నగరాన్ని అంటారో తెలుసా?

భారత వజ్రాల రాజధానిగా సూరత్‌కు గుర్తింపు

ప్రపంచంలోని 90 శాతం వజ్రాల పాలిషింగ్ ఇక్కడే

సూరత్ వజ్రాలకు దక్కిన జీఐ ట్యాగ్

ప్రపంచంలోనే అతిపెద్ద ఆఫీస్ కాంప్లెక్స్ డైమండ్ బోర్స్

టెక్స్‌టైల్స్ రంగంలో 'సిల్క్ సిటీ'గానూ ప్రసిద్ధి



వజ్రం.. ఈ భూమిపైనే అత్యంత ఖరీదైన రత్నం. గనుల నుంచి ముడి రూపంలో వచ్చే ఆ రాయిని కోటి కాంతుల వజ్రంగా మార్చే అద్భుత మంత్రదండం ఎక్కడుందో తెలుసా? ఏ ఆఫ్రికా అడవుల్లోనో, అమెరికా ల్యాబ్‌ల్లోనో కాదు.. మన గుజరాత్‌లోని 'సూరత్' నగరంలో! ప్రపంచవ్యాప్తంగా నగల దుకాణాల్లో మెరుస్తున్న ప్రతి 10 వజ్రాల్లో 9 ఈ గడ్డపైనే రూపుదిద్దుకుంటాయి. అందుకే ఈ నగరానికి "డైమండ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా" అని పేరొచ్చింది.

**సానబెట్టే నైపుణ్యం**

తపతీ నది ఒడ్డున ఉండే సూరత్ ప్రస్థానం కొందరు స్థానిక వ్యాపారుల విజనరీతో మలుపు తిరిగింది. ఇక్కడి కళాకారుల చేతుల్లో ఏదైనా మాయ ఉందా? అనిపిస్తుంది. ముడి వజ్రాన్ని అత్యంత కచ్చితత్వంతో కటింగ్, పాలిషింగ్ చేయడంలో వారి నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన మేనేజ్‌మెంట్ సూరత్‌ను తిరుగులేని గ్లోబల్ హబ్‌గా మార్చాయి. దీనికి గుర్తింపుగా ఇటీవల 'సూరత్ కట్ డైమండ్'కు ప్రతిష్ఠాత్మక 'భౌగోళిక గుర్తింపు' (జీఐ ట్యాగ్) కూడా లభించింది. నేడు ఈ ఒక్క పరిశ్రమపైనే ఆధారపడి లక్షలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

**పెంటగాన్‌ను దాటేసిన 'డైమండ్ బోర్స్'**

సూరత్ ఖ్యాతిని ప్రపంచ పటంలో మరో మెట్టు ఎక్కించిన అద్భుతం 'సూరత్ డైమండ్ బోర్స్'. అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్' కంటే పెద్ద ఆఫీస్ కాంప్లెక్స్ ఇది. వజ్రాల వ్యాపారులు, డిజైనర్లు, ఎగుమతిదారులు అందరినీ ఒకే గొడుగు కిందికి తెచ్చిన ఈ భారీ బిజినెస్ హబ్.. అంతర్జాతీయ మార్కెట్లో సూరత్‌ను వజ్రాల రారాజుగా నిలబెట్టింది.

**సిల్క్ సిటీ కూడా ఇదే..**

సూరత్ కేవలం డైమండ్స్‌తోనే కాదు.. టెక్స్‌టైల్స్ రంగంలోనూ దేశంలో టాప్‌లో దూసుకుపోతోంది. అందుకే దీనిని ప్రేమగా 'సిల్క్ సిటీ' అని కూడా అంటారు. పారిశుద్ధ్యంలోనూ, వేగవంతమైన పట్టణాభివృద్ధిలోనూ ఇండియాలోనే ది బెస్ట్ సిటీగా నిలిచిన సూరత్.. ప్రపంచంలో ఎక్కడో పుట్టిన ముడి రాయిని తన నైపుణ్యంతో అద్భుత రత్నంగా మార్చి విశ్వవ్యాప్తం చేస్తోంది. గనులు ఎక్కడున్నా.. మెరుగులు అద్దేది మాత్రం సూరతే!


# ఇది మామూలు వాడకం కాదు సామీ..

63 శాతం మంది భారతీయుల ప్రేమకు 'ఏఐ'నే గురువట! – భారత్‌లో డేటింగ్ కోసం ఏఐని వాడుతున్న 61శాతం మంది

గ్లీడెన్, ఇప్సోస్ సర్వేలో వెల్లడైన ఆసక్తికర విషయాలు – ఆకట్టుకునే ప్రొఫైల్స్, సంభాషణల కోసం రోబోల సాయం

ఏఐ వాడకం పెరిగినా 57శాతం మందిలో తగ్గని ఒంటరితనం

ఆన్‌లైన్ డేటింగ్‌లో సహజత్వానికే ఎక్కువ విలువిస్తున్నారని వెల్లడి



ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లలో మీ సంభాషణలు ఈ మధ్య కాస్త యాంత్రికంగా, మనుషులు మాట్లాడినట్టు కాకుండా ఉన్నాయని మీకు అనిపిస్తోందా? అయితే మీరు అనుమానించింది నిజమే. డేటింగ్ ప్రపంచంలోకి 'ఏఐ స్లాప్' అనే కొత్త శకానికి స్వాగతం. భారత్‌లో ఆన్‌లైన్ డేటింగ్ చేసే వారు తమ భాగస్వాములను ఆకట్టుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయం తీసుకుంటున్నారని ఓ భారీ సర్వేలో వెల్లడైంది. ఈ క్రమంలో మన ప్రేమ కబుర్లను, భావాలను కూడా రోబోలకు అప్పగిస్తున్నామని తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. ప్రముఖ డేటింగ్ యాప్ గ్లీడెన్, సర్వే సంస్థ ఇప్సోస్ సంయుక్తంగా 1,500 మంది భారతీయులపై జరిపిన సర్వేలో ఈ విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. సర్వేలో పాల్గొన్న వారిలో ఏకంగా 61 శాతం మంది తమ సంభావ్య భాగస్వాములతో సంభాషణలను మెరుగుపరచుకోవడానికి ఏఐపై ఆధారపడినట్లు అంగీకరించారు. ఆకట్టుకోలేని బయోను ఆసక్తికరంగా మార్చడం నుంచి, సంభాషణ మధ్యలో చమత్కారమైన సమాధానం ఇవ్వడం వరకు.. ప్రతీ విషయంలోనూ 'ఏఐ వింగ్‌మ్యాన్' ఆధునిక డేటింగ్ సంస్కృతిలో ఒక సాధారణ భాగంగా మారిపోయింది.

**వింగ్‌మ్యాన్‌గా మారిన అల్గారిథమ్**

ఈ సర్వే ఫలితాలు ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉన్నాయి. దాదాపు 63 శాతం మంది భారతీయులు తమ ప్రేమ వ్యవహారాల్లో సలహాల కోసం ఏఐ టూల్స్‌ను ఒక కోచ్‌గా ఉపయోగించుకుంటున్నారు. అదేవిధంగా, 66 శాతం మంది తమ డేటింగ్ ప్రొఫైల్స్ లేదా సోషల్ మీడియా బయోలను మెరుగుపరచడానికి ఏఐ సహాయం తీసుకున్నారు. ఇక 61 శాతం మంది అయితే సంభావ్య భాగస్వాములతో నిజ సమయంలో మాట్లాడేటప్పుడు కూడా సంభాషణలను చక్కదిద్దుకోవడానికి ఏఐని వాడినట్టు తెలిపారు. అంటే, మిమ్మల్ని ఆకట్టుకున్న ఆ తొలి మెసేజ్, ఆలోచించి పంపినట్లున్న ఆ సమాధానం, మిమ్మల్ని క్షణం ఆగి ఆలోచించేలా చేసిన ఆ ప్రొఫైల్.. ఇవేవీ పూర్తిగా అవతలి వ్యక్తి సొంత ఆలోచన కాకపోవచ్చని ఈ సర్వే తేటతెల్లం చేస్తోంది.

నిజానికి, ప్రేమ విషయంలో సలహాలు తీసుకోవడం మానవులకు కొత్తేమీ కాదు. ఒకప్పుడు స్నేహితులకు ఫోన్ చేసి ఏం రిప్లై ఇవ్వాలో అడిగేవారు. డేటింగ్ ప్రొఫైల్‌ను ఎలా పెట్టాలో నిపుణులైన స్నేహితుల సలహా తీసుకునేవారు. ఇప్పుడు ఆ స్నేహితుడి స్థానంలోకి ఏఐ వచ్చింది. ఇది 24 గంటలూ అందుబాటులో ఉంటుంది, ఎంతటి ప్రశ్నలకైనా ఓపికగా సమాధానమిస్తుంది, మన అభిరుచులను ఎగతాళి చేయదు.

**పెరుగుతున్న ఒంటరితనం.. ఓ విచిత్ర పరిస్థితి**

ఏఐ మన ప్రొఫైళ్లను అత్యంత ఆకర్షణీయంగా చూపిస్తున్నప్పటికీ, అది మనకు ఆనందాన్ని ఇవ్వడం లేదని ఈ సర్వే స్పష్టం చేస్తోంది. సర్వేలో పాల్గొన్న వారిలో 92 శాతం మంది తమ రొమాంటిక్ జీవితంతో సంతృప్తిగా ఉన్నామని చెప్పినప్పటికీ, వారిలో 57 శాతం మంది ఇప్పటికీ ఒంటరితనంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. ఒక అల్గారిథమ్ అద్భుతమైన టెక్ట్స్ మెసేజ్ రాయగలదేమో కానీ, ఇద్దరి మధ్య నిజమైన కెమిస్ట్రీని, భావోద్వేగాలను, సహజమైన అనుభవాన్ని భర్తీ చేయలేదని ఇది రుజువు చేస్తోంది. మన ప్రేమ వ్యవహారాల్లోకి ఏఐ ఎంతగా చొచ్చుకువస్తుందో, నిజాయతీ, సహజత్వం అంత విలువైనవిగా మారుతున్నాయి. అసంపూర్ణంగా, కాస్త ఇబ్బందికరంగా ఉన్నా సరే, నిజాయతీగా ఉండటమే నేటి డిజిటల్ డేటింగ్ మార్కెట్లో అత్యంత అరుదైన వస్తువుగా మారుతోందని నిపుణులు అంటున్నారు. తమ ఏఐ సంభాషణల హిస్టరీని ఎవరైనా చూస్తే చాలా ఇబ్బందిగా ఉంటుందని 69 శాతం మంది చెప్పడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అంటే, ఆ సంభాషణలు తమ అసలైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించవని వారికి తెలుసు. అనిశ్చితి, సందేహాలు ఉన్నప్పుడు ఏఐ చాట్ బాట్‌ల వద్ద ముసుగు తీసేసి, డేటింగ్ ప్రొఫైల్‌లో మాత్రం మళ్లీ ఆ ముసుగును ధరిస్తున్నారని ఈ అధ్యయనం తేల్చింది.

# పుట్టినరోజున బాలకృష్ణ కీలక ప్రకటన.. ఒకే వేదికపైకి తెలుగు సీఎంలు, కేంద్ర మంత్రులు

జూన్ 22న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవాల ముగింపు సభ

హాజరుకానున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా, సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి

క్యాన్సర్ చిన్నారుల మధ్య పుట్టినరోజు జరుపుకొన్న ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్‌లో కొత్త బ్లాక్, అమరావతిలో నూతన ఆసుపత్రి నిర్మాణంపై ప్రకటన

ఆసుపత్రికి పలువురి నుంచి భారీగా విరాళాలు.. స్వీకరించిన బాలయ్య




బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకల ముగింపు సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆసుపత్రి ఛైర్మన్, ప్రముఖ నటుడు శ్రీ నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. జూన్ 22వ తేదీన హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలను ఆయన తెలియజేశారు. ఈ ముగింపు వేడుకకు కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి జె.పి. నడ్డా, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతారని బాలకృష్ణ తెలిపారు. వీరితో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

**సేవా పథంలో 25 ఏళ్లు.. భవిష్యత్‌పై కీలక ప్రకటనలు**

2000వ సంవత్సరంలో తన తల్లిదండ్రులు స్వర్గీయ నందమూరి తారకరామారావు, శ్రీమతి బసవతారకం ఆశయాలకు అనుగుణంగా ఈ ఆసుపత్రిని ప్రారంభించామని బాలకృష్ణ గుర్తుచేసుకున్నారు. లాభాపేక్ష లేకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు సేవలందించడమే లక్ష్యంగా గత 25 ఏళ్లుగా సంస్థ పనిచేస్తోందన్నారు. గత సంవత్సర కాలంగా రజతోత్సవాల సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ వేడుకల ద్వారా గడిచిన కాలాన్ని సమీక్షించుకుంటూ, భవిష్యత్ కార్యాచరణను కూడా ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో "నార్త్ బ్లాక్" నిర్మాణం, అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని తుళ్లూరులో మరో నూతన ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ 25 ఏళ్ల ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

**చిన్నారుల మధ్య బాలయ్య జన్మదిన వేడుకలు.. విరాళాల వెల్లువ**

మీడియా సమావేశానికి ముందు, నందమూరి బాలకృష్ణ తన పుట్టినరోజును ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్యాన్సర్ బాధిత చిన్నారుల మధ్య జరుపుకున్నారు. సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను చిన్నారులతో కలిసి కట్ చేసి, వారికి పంచిపెట్టారు. అనంతరం వారికి ఆటబొమ్మలు, ఇతర బహుమతులు అందించి వారి ముఖాల్లో ఆనందం నింపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి పలువురు ఉదారంగా విరాళాలు అందించారు.

హైదరాబాద్‌కు చెందిన శ్రీ సీతారామారాజు అందించిన లక్ష రూపాయల విరాళాన్ని బాలకృష్ణ స్వీకరించారు. త్రివేణి, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులు క్యాన్సర్ రోగుల సహాయార్థం సేకరించిన రూ. 1,01,116 విరాళాన్ని ఆయకు అందజేశారు. చిన్న వయసులోనే విద్యార్థులు చూపిన సేవాగుణాన్ని బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అమరావతిలో నిర్మించనున్న ఆసుపత్రి కోసం శ్రీ కాకర్ల రాఘవేంద్ర రావు అందించిన రూ. 10 లక్షల చెక్కును కూడా ఆయన స్వీకరించారు. దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాలకృష్ణతో పాటు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి. సుబ్రహ్మణ్యేశ్వర రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికోటేశ్వర రావు, అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సావరిన్ గోల్డ్ బాండ్లు

## పెట్టుబడిదారులకు కాసుల వర్షం

సావరిన్ గోల్డ్ బాండ్ల ముందస్తు విత్‌డ్రాకు ఆర్బీఐ గ్రీన్ సిగ్నల్

2019-20 సిరీస్ VII యూనిట్‌కు రూ. 15,275గా ధర ఖరారు

పెట్టుబడిదారులకు 300 శాతానికి పైగా భారీ లాభాలు

లక్ష రూపాయల పెట్టుబడి విలువ రూ. 4 లక్షలకు పైగా వృద్ధి

సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ) పెట్టుబడిదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) తీపి కబురు అందించింది. 2019-20 సిరీస్-VII బాండ్ల ముందస్తు విత్ డ్రా (ప్రీమెచ్యూర్ రిడంప్షన్) ధరను యూనిట్‌కు రూ. 15,275గా ఖరారు చేసింది. ప్రస్తుతం పసిడి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతుండటంతో, ఇన్వెస్టర్లకు ఊహించని రీతిలో భారీ లాభాలు దక్కనున్నాయి. 2019 డిసెంబర్ 10న జారీ చేసిన ఈ బాండ్లకు ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం ముందస్తుగా నగదుగా మార్చుకునే వెసులుబాటును ఆర్‌బీఐ కల్పించింది. ఈ బాండ్లు జారీ చేసిన సమయంలో ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన వారికి గ్రాము రూ. 3,745కే లభించాయి. ప్రస్తుత రిడంప్షన్ ధర ప్రకారం చూస్తే, ప్రతి గ్రాముపై సుమారు రూ. 11,530 మేర లాభం చేకూరుతోంది. ఇది దాదాపు 308 శాతం రాబడికి సమానం. ఉదాహరణకు, అప్పట్లో ఒక లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన వారి పెట్టుబడి విలువ ప్రస్తుతం సుమారు రూ. 4.08 లక్షలకు చేరుకుంది. దీనికి అదనంగా ఏటా లభించే 2.5 శాతం వడ్డీ ప్రయోజనం కూడా ఇన్వెస్టర్లకు దక్కుతుంది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) వెల్లడించిన గత మూడు పనిదినాల (జూన్ 5, 8, 9) ముగింపు ధరల సగటు ఆధారంగా ఆర్‌బీఐ ఈ రిడంప్షన్ ధరను నిర్ణయించింది. 999 స్వచ్ఛత కలిగిన బంగారం సగటు ధరను ఇందుకు ప్రామాణికంగా తీసుకున్నారు. భౌతిక బంగారంతో పోలిస్తే ఎటువంటి నిల్వ సమస్యలు, భద్రతాపరమైన ఆందోళనలు లేని సావరీన్ గోల్డ్ బాండ్లను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ జారీ చేస్తుంది. ఈ బాండ్ల మొత్తం కాలపరిమితి 8 ఏళ్లు కాగా, ఐదేళ్ల తర్వాత విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. బాండ్లను మెచ్యూరిటీ వరకు (8 ఏళ్లు) కొనసాగిస్తే మూలధన లాభాలపై పన్ను మినహాయింపు లభిస్తుంది. ముందస్తుగా విత్‌డ్రా చేసుకోవాలనుకునే వారు సంబంధిత బ్యాంకులు, పోస్టాఫీసులు లేదా డిపాజిటరీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

# షుగర్ కంట్రోల్‌లో ఉండాలా?.. అయితే కార్బోహైడ్రేట్లు ఎప్పుడు తినాలో తెలుసుకోండి!

దేశంలో సుమారు 13.6 కోట్ల మంది ప్రీడయాబెటిస్ దశలో ఉన్నారని తాజా నివేదికల వెల్లడి

ఉదయం పూట కార్బోహైడ్రేట్లు తీసుకుంటే శరీరం వాటిని సులభంగా జీర్ణం చేసుకుని శక్తిగా మార్చే అవకాశం

రాత్రి 8 గంటల తర్వాత కార్బోహైడ్రేట్లు తింటే ఇన్సులిన్ సెన్సిటివిటీ తగ్గి రక్తంలో చక్కెర స్థాయుల పెరుగుదల

శరీర గడియారానికి అనుగుణంగా ఆహార వేళలను మార్చుకోవడం మధుమేహం నియంత్రణకు కీలకం



భారతదేశంలో ప్రీడయాబెటిస్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం, దేశంలో సుమారు 13.6 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఇది తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం ఏం తింటున్నాం అన్నదానితో పాటు, ఎప్పుడు తింటున్నాం అన్నది కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు (పిండిపదార్థాలు) తీసుకునే సమయం, రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**శరీర గడియారం - జీవక్రియ**

మన శరీరం ఒక క్రమపద్ధతిలో పనిచేస్తుంది, దీనిని "సర్కాడియన్ రిథమ్" లేదా శరీర గడియారం అంటారు. మనం ఉదయం మేల్కొన్నప్పటి నుంచి ఇది పనిచేయడం మొదలుపెడుతుంది. ఈ శరీర గడియారం మన జీవక్రియను నియంత్రిస్తుంది. ఉదయం పూట మన జీవక్రియ రేటు చాలా చురుకుగా ఉంటుంది. అందుకే ఆ సమయంలో తీసుకున్న ఆహారం, ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిగా మారతాయి. ఈ సమయంలో ఇన్సులిన్ కూడా చాలా సమర్థవంతంగా పనిచేసి, రక్తంలోని గ్లూకోజ్‌ను కణాల్లోకి పంపడంలో సహాయపడుతుంది.

**రాత్రిపూట కార్బోహైడ్రేట్లతో ప్రమాదం ఎందుకు?**

అదే కార్బోహైడ్రేట్లను రాత్రిపూట, ముఖ్యంగా రాత్రి 8 గంటల తర్వాత తీసుకుంటే పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. రాత్రి సమయంలో మన జీవక్రియ సహజంగానే నెమ్మదిస్తుంది. శరీర కదలికలు కూడా తక్కువగా ఉంటాయి. దీనికి తోడు, సాయంత్రం వేళల్లో ఇన్సులిన్ సెన్సిటివిటీ (సున్నితత్వం) తగ్గుతుంది. ఫలితంగా, రాత్రిపూట తీసుకున్న కార్బోహైడ్రేట్లు సరిగా జీర్ణం కాక, రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరిగిపోతాయి. ఈ అదనపు గ్లూకోజ్ శక్తిగా మారకుండా, కొవ్వుగా నిల్వ ఉండే ప్రమాదం ఉంది. ఇది బరువు పెరగడానికి, నిద్రలేమికి, దీర్ఘకాలంలో ప్రీడయాబెటిస్, టైప్-2 డయాబెటిస్‌కు దారితీస్తుంది.

**పరిశోధనలు ఏం చెబుతున్నాయి?**

'ఫార్మకోలాజికల్ రీసెర్చ్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, ఉదయం పూట కార్బోహైడ్రేట్లు తీసుకున్నప్పుడు రక్తంలో గ్లూకోజ్ ప్రతిస్పందన మెరుగ్గా ఉంటుందని తేలింది. అదేవిధంగా 'న్యూట్రిషన్, మెటబాలిజం అండ్ కార్డియోవాస్కులర్ డిసీజెస్' జర్నల్‌లోని మరో అధ్యయనం, ఒకే రకమైన ఆహారాన్ని ఉదయం, రాత్రి తీసుకున్నప్పుడు... రాత్రి తీసుకున్న వారిలో రక్తంలో చక్కెర స్థాయులు గణనీయంగా పెరిగినట్లు గుర్తించింది. ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ అంబరీష్ మిథాల్ కూడా, "రోజంతా గ్లూకోజ్ జీవక్రియలో సర్కాడియన్ రిథమ్ కీలక పాత్ర పోషిస్తుంది" అని ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

**ఆచరించాల్సిన సాధారణ సూచనలు**

రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచుకోవడానికి, మధుమేహం ముప్పును తగ్గించుకోవడానికి ఈ కింది సూచనలు పాటించడం మంచిది.

**ఉదయం, మధ్యాహ్నం కార్బోహైడ్రేట్లు:** కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంలో భాగంగా తీసుకోండి.

రాత్రి త్వరగా భోజనం: రాత్రి భోజనాన్ని 7-8 గంటల లోపే పూర్తి చేయాలి. రాత్రిపూట కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే తేలికపాటి ఆహారం తీసుకోవాలి.

**స్థిరమైన ఆహార వేళలు:** ప్రతిరోజూ ఒకే సమయానికి ఆహారం తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది.

**ప్రొటీన్, ఫైబర్‌తో జతచేయండి:** కార్బోహైడ్రేట్లతో పాటు ప్రొటీన్, ఫైబర్ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పోషకాలు సరిగా గ్రహించబడి, రక్తంలో గ్లూకోజ్ నెమ్మదిగా విడుదలవుతుంది.

ప్రీడయాబెటిస్ ఉన్నవారు, ఊబకాయం, జీవక్రియ సంబంధిత సమస్యలతో బాధపడే వారు, నైట్ షిఫ్ట్‌లలో పనిచేసేవారు ఆహార వేళల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. సరైన సమయంలో సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# కోహ్లీ, రోహిత్ భవిష్యత్తుపై సస్పెన్స్..

గంభీర్‌ను కాదని బీసీసీఐ పెద్దల దగ్గరకు సీనియర్లు? - వన్డే ప్రపంచకప్ భవిష్యత్తుపై స్పష్టత కోసం యత్నం

రోహిత్, కోహ్లీల వన్డే లైనప్‌పై సస్పెన్స్ - వన్డే ప్రణాళికలపై ఇంకా దృష్టిపెట్టని గంభీర్

డ్రెస్సింగ్ రూమ్‌లో గిల్ పట్టు సాధించాల్సి ఉంది - వన్డే ప్రపంచకప్‌కు ఇంకా 16 నెలలే



భారత క్రికెట్ జట్టులో అంతర్గతంగా పెను మార్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా సన్నాహాలు ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్ ద్వారా ప్రారంభం కానున్న వేళ జట్టులో తీవ్రమైన గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. టెస్టులు, టీ20 ఫార్మాట్లలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. వన్డేల విషయంలో మాత్రం ఇంకా పట్టు సాధించలేకపోతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే జట్టులోని కొందరు 'సీనియర్ ఆటగాళ్లు' కోచ్ గంభీర్‌ను, సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్‌ను పక్కనబెట్టి.. తమ వన్డే భవిష్యత్తుపై నేరుగా బీసీసీఐ అగ్రనేతలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లో వీరిద్దరూ ఆడతారా లేదా? అనే దానిపై కొంతకాలంగా సస్పెన్స్ కొనసాగుతోంది. గంభీర్ కోచింగ్ శైలి, సెలక్టర్ల కఠినమైన డిమాండ్ల వల్లే సీనియర్లు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్ సందర్భంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన కోహ్లీ.. "తాను మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేని స్థితిలో ఉన్నాను" అంటూ పరోక్షంగా తన అసంతృప్తిని వెల్లడించారు. మరోవైపు రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిలోనూ ఇప్పుడు మార్పు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్‌కు, సీనియర్ ఆటగాళ్లకు మధ్య పూర్తిస్థాయిలో అవగాహన కుదరలేదని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' నివేదిక పేర్కొంది. "రోహిత్, కోహ్లీ లాంటి దిగ్గజాలు జట్టులో ఉన్నప్పటికీ.. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ డ్రెస్సింగ్ రూమ్‌లో తన పట్టును నిరూపించుకోవాల్సి ఉంటుంది. గంభీర్ మిగతా రెండు ఫార్మాట్లలో శ్రద్ధ పెట్టినంతగా వన్డే ప్రణాళికల్లో ఇంకా దృష్టి సారించలేదు" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అయితే వన్డే ప్రపంచకప్‌నకు కేవలం 16 నెలల సమయం మాత్రమే ఉన్నందున.. గంభీర్, గిల్ కలిసి త్వరలోనే డ్రెస్సింగ్ రూమ్‌లో తమ ఆలోచనలను స్పష్టంగా పంచుకోవాల్సి ఉంటుంది. దశాబ్ద కాలంగా దేశానికి సేవ చేసిన సీనియర్ ఆటగాళ్లకు.. జట్టు యాజమాన్యం వారి నుంచి ఏం ఆశిస్తోంది? ప్రపంచకప్ రోడ్ మ్యాప్ ఏంటి? అనే విషయాలను సూటిగా కమ్యూనికేట్ చేయాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది నవంబర్ నాటికి విరాట్ కోహ్లీకి 38 ఏళ్లు, రోహిత్ శర్మకు 39 ఏళ్లు నిండనున్నాయి. వయసు రీత్యా వారి భవిష్యత్తుపై వస్తున్న ప్రశ్నలను గంభీర్, గిల్ బీసీసీఐ పెద్దలు ఎలా హ్యాండిల్ చేస్తారనే దానిపైనే రాబోయే వరల్డ్ కప్‌లో భారత విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.



# ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చిన గంటల్లోనే షాక్..

వన్డే సిరీస్ నుండి హార్దిక్ పాండ్యా అవుట్!

శనివారం నుంచి ఇండియా - ఆఫ్ఘనిస్థాన్ మధ్య వన్డే సిరీస్

ఫిట్‌నెస్ క్లియరెన్స్ తర్వాత తొడ కండరాల గాయం బారిన పడిన హార్దిక్ పాండ్యా

కోలుకోవడానికి మూడు వారాల సమయం పడుతుందన్న వైద్యులు

ఐపీఎల్ 2026 ముగిసిన తర్వాత భారత క్రికెట్ జట్టు ఆడబోయే మొదటి వన్డే సిరీస్ ముంగిట టీమిండియాకు ఊహించని భారీ షాక్ తగిలింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. కేవలం కొన్ని గంటల క్రితమే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) నుండి పూర్తి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందిన హార్దిక్.. అంతలోనే మళ్లీ గాయపడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**గంటల వ్యవధిలోనే మారిన సీన్:**

ఐపీఎల్ సమయంలో వెన్నునొప్పి కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమైన హార్దిక్ పాండ్యా... వన్డే సిరీస్ కోసం జశీజు లో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాడు. అక్కడ అసెస్‌మెంట్‌లో భాగంగా తన పూర్తి కోటా అయిన 10 ఓవర్లు బౌలింగ్ చేయడంతో స్పోర్ట్స్ సైన్స్ టీమ్ అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, బుధవారం నాటి ప్రాక్టీస్ సెషన్‌లో దురదృష్టవశాత్తూ హార్దిక్ తొడ కండరాల గాయం బారిన పడ్డాడు. ఈ కొత్త గాయం నుండి కోలుకోవడానికి కనీసం రెండు నుండి మూడు వారాల సమయం పడుతుందని వైద్యులు తేల్చడంతో, అతడు సిరీస్ నుండి పూర్తిగా వైదొలగాల్సి వచ్చింది.

రోహిత్ శర్మతో కలిసి హార్దిక్ వన్డేల్లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడనే సంతోషంలో ఉన్న టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఈ తాజా పరిణామం తీవ్ర ఆందోళనలోకి నెట్టింది. 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళికల్లో భాగంగా హార్దిక్‌ను వన్డేల్లో ఎక్కువగా ఆడించాలని సెలక్టర్లు భావించారు. అందుకోసమే అతనికి టీ20 సిరీస్ నుండి విశ్రాంతి కూడా ఇచ్చారు. ఇప్పటికే విరాట్ కోహ్లీ కూడా గాయంతో ఈ సిరీస్‌కు దూరం కాగా, ఇప్పుడు హార్దిక్ కూడా అవుట్ అవ్వడం జట్టు సమతుల్యతను దెబ్బతీసింది. శనివారం నుండి ధర్మశాలలో ప్రారంభం కానున్న ఈ వన్డే సిరీస్‌లో హార్దిక్ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే దానిపై సెలక్షన్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది.



# మిశ్రమంగా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి మిక్స్‌డ్‌గా స్థిరపడ్డాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాలతో ముగియగా.. నిఫ్టీ నష్టాల్లోకి జారుకుంది. ట్రేడింగ్ ఆరంభంలో లాభాలు కనిపించినప్పటికీ ద్వితీయార్థంలో మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, స్థిరాస్తి రంగాల షేర్లలో భారీగా లాభాల స్వీకరణ కనిపించింది. దీంతో మార్కెట్లు గరిష్ఠ స్థాయుల నుంచి వెనక్కి తగ్గాయి. చివరకు సెన్సెక్స్ 64.42 పాయింట్లు లాభపడి 73,983.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయి 23,214.95 వద్ద ముగిసింది.

నిఫ్టీ షేర్లలో హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మీడియా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ రంగాలు నష్టాలు మూటగట్టుకున్నాయి. దీనితో పాటు మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ షేర్లపై విక్రయాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్-క్యాప్ సూచీ 1.49 శాతం, నిఫ్టీ స్మాల్-క్యాప్ సూచీ 1.33 శాతం చొప్పున పతనమై ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. కొన్ని దిగ్గజ షేర్లు భారీ నష్టాల నుంచి మార్కెట్లను గట్టెక్కించాయి. సెన్సెక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల బాట పట్టి సూచీని గ్రీన్ జోన్‌లో నిలబెట్టాయి. ముఖ్యంగా నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ ఒక శాతానికి పైగా లాభపడగా ప్రైవేట్ బ్యాంకులు, కెమికల్ రంగాలు కూడా రాణించాయి.

# సినిమా న్యూస్



మృణాల్ ఠాకూర్ గ్రేస్‌ఫుల్ బ్యూటీ, స్టార్ మూవీ కెరీర్‌తో ఆమె టీవీలో ముజ్సే కుచ్ కెహ్తా...యే ఖామోషియాన్ వంటి షోలతో తన కెరీర్‌ను ప్రారంభించింది మరియు కుంకుమ్ భాగ్యలో బుల్బుల్‌గా పేరు తెచ్చుకుంది.

## 'పెద్ది' చిత్రానికి కాసుల వర్షం.. ఆరు రోజుల్లోనే అరుదైన రికార్డు

**బాక్సాఫీస్ వద్ద 'పెద్ది' సినిమా వసూళ్ల వర్షం**
**ఆరు రోజుల్లోనే రూ. 332 కోట్లకు పైగా గ్రాస్**
**వసూళ్లువసూళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన నిర్మాణ సంస్థ**
**రామ్ చరణ్ నటనకు ప్రశంసల వెల్లువ**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా విడుదలైన కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి దూసుకుపోతోంది.

జూన్ 4న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాకు తొలిరోజు నుంచే మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా వసూళ్ల వివరాలను నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ అధికారికంగా ప్రకటిస్తూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ భారీ విజయం పట్ల చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది.

ఈ సినిమాలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. ఆయన కెరీర్‌లో ఇదొక గుర్తుండిపోయే పాత్రగా నిలుస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి.


ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించి తమ నటనతో ఆకట్టుకున్నారు.

## సూపర్ స్టార్ రజనీకాంత్‌తో సిద్ధాంత విభేదాలు.. దర్శకుడు భారతీరాజా వ్యక్తిత్వంలోని మరో కోణం!

దిగ్గజ దర్శకుడు భారతీరాజా మరణంతో ఆయన సినీ ప్రయాణానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన విషయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ప్రేమకథల నుండి సస్పెన్స్ థ్రిల్లర్ల వరకు ఎన్నో అద్భుత చిత్రాలను అందించిన భారతీరాజా గారి కెరీర్‌లో.. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ఆయనకున్న అనుబంధం, వారి మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎప్పుడూ ఒక హాట్ టాపిక్‌గా నిలిచేవి.

భారతీరాజా దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన 'పదహారేళ్ల వయసు' (తమిళ్), 'కోడి పరక్కుదు' వంటి చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే, వృత్తిపరంగా ఒకరినొకరు గౌరవించుకున్నప్పటికీ... పలు సామాజిక, రాజకీయ అంశాలపై వీరిద్దరి దారులు వేరుగా ఉండేవి. ముఖ్యంగా తమిళనాడు – కర్ణాటక మధ్య జరిగిన కావేరి జలాల వివాదం సమయంలో వీరి మధ్య విభేదాలు బహిరంగంగా కనిపించాయి.

ఆనాడు తమిళ సినీ పరిశ్రమ చేపట్టిన ఆందోళనలపై రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలను భారతీరాజా తీవ్రంగా విమర్శించారు. అలాగే, రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించినప్పుడు కూడా... తమిళనాడును ఇక్కడి సంస్కృతి, భాష, ప్రాంతీయ భావజాలాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న నాయకులే పరిపాలించాలని



భారతీరాజా నిర్మొహమాటంగా స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద సంచలనంగా మారాయి. అయితే ఈ విమర్శలు కేవలం సిద్ధాంతపరమైనవే కానీ, వ్యక్తిగతంగా రజనీకాంత్‌పై ఆయనకు ఎలాంటి శత్రుత్వం లేదని వారి సన్నిహితులు చెబుతుంటారు.

తమిళ సంస్కృతి, భాషపై ఉన్న అమితమైన ప్రేమ వల్లే ఆయన తన అభిప్రాయాలను అంత నిర్భయంగా చెప్పేవారని సినీ విశ్లేషకులు భావిస్తారు. తనకు నచ్చిన విషయానికి మద్దతు ఇవ్వడం, విభేదించిన అంశంపై బహిరంగంగా స్పందించడం ఆయన సహజ స్వభావం. అభిప్రాయ భేదాలు ఎలా ఉన్నా, తమిళ సినీ చరిత్రలో వీరిద్దరి ముద్ర చెరగనిది.

## సాయిపల్లవి సలహాతో గండం నుంచి గట్టెక్కిన అనుపమ!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో.. చురుకైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటి అనుపమ పరమేశ్వరన్ తన జీవితంలోని ఓ చీకటి అధ్యాయాన్ని.. ఆ సమయంలో తనకు లభించిన ఒక ఆత్మీయ మద్దతును ఇటీవల రివీల్ చేసారు. 2021వ సంవత్సరం తన వ్యక్తిగత – వృత్తిపరమైన జీవితంలో అత్యంత కష్టమైన కాలమని గుర్తు చేసుకున్నారు. ఆ మానసిక ఒత్తిడి నుండి బయట పడటానికి తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించుకోవడానికి తోటి నటి సాయి పల్లవి ఎలా సహాయపడిందో? అనుపమ వివరించారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోవిడ్ పరిస్థితులు.. కెరీర్‌లో ఎదురైన కొన్ని ఒడిదుడుకులు అనుపమను తీవ్రమైన మానసిక ఆందోళనకు గురిచేసాయి. ఆ సమయంలో ఇండస్ట్రీ సహా బయట వ్యక్తులు చాలా మందితో కమ్యూనికేషన్ తెగిపోయింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సాయి పల్లవి ఆమెకు అండగా నిలిచారు. ఒక నటిగా కాకుండా మంచి స్నేహితురాలిగా అనుపమ బాధను అర్థం చేసుకుని.. ఆమె మనసును ప్రశాంత పరచడానికి నిరంతరం శ్రమించారని అనుపమ కృతజ్ఞతతో చాటుకున్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఏదైనా సృజనాత్మక పనిపై దృష్టి పెట్టాలని సాయి పల్లవి ఆమెకు సలహా ఇచ్చారు. అందులో భాగంగానే అనుపమకు పెయింటింగ్ అలవాటును పరిచయం చేశారు. రంగులతో కాన్వాస్‌పై భావాలను పంచుకోవడం ద్వారా మనసులోని భారాన్ని దించుకోవచ్చని సాయి పల్లవి సూచించారుట. అలా మొద లైన పెయింటింగ్ ప్రయాణం, అనుపమ జీవితంలో సరికొత్త ఊరటను, ప్రశాంతతను తసుకొచ్చింది. తొలినాళ్లలో కాలక్షేపం కోసం ..మనశ్శాంతి కోసం వేసిన రంగులు, కాలక్రమేణా అనుపమలో సరికొత్త నైపుణ్యాన్ని వెలికితీశాయి. పెయింటింగ్ వేయడం వల్ల తన ఆలోచనలలో స్పష్టత వచ్చిందని.. తనపై తనకు నమ్మకం పెరిగిందన్నారు. ఆ కష్ట కాలంలో కాన్వాస్ బోర్డు, బ్రష్‌లు తనకు అత్యంత ఆప్తమిత్రులుగా మారాయన్నారు. తనలోని ప్రతికూల ఆలోచనలన్నింటినీ రంగుల రూపంలో సానుకూలంగా మార్చుకోగలిగానని వివరించారు.



చిత్ర పరిశ్రమలో నటీనటుల మధ్య పోటీ వాతావరణం ఉంటుందనే అభిప్రాయం సమాజంలో ఉంది. కానీ ఒకే రంగంలో ఉన్న ఇద్దరు స్టార్ హీరోయిన్ల మధ్య ఇంతటి లోతైన, నిస్వార్థమైన స్నేహబంధం ఉండటం అటు అభిమానులను.. ఇటు పరిశ్రమ వర్గాలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సాయి పల్లవి చూపించిన చొరవ, మానవీయ కోణం ఆమెపై గౌరవాన్ని మరింత రెట్టింపు చేసిందని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. కష్టాలను అధిగమించి కెరీర్ పరంగా వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతున్న అనుపమ ఇప్పటికీ ఖాళీ సమయాల్లో పెయింటింగ్ కొనసాగిస్తున్నారు. జీవితంలో ఎదురయ్యే మానసిక సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదో ఒక కళ లేదా అభిరుచి ఎంతగానో తోడ్పడుతుందనే దానికి తన జీవితమే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. నటనలోనే కాకుండా చిత్రలేఖనంలోనూ సృజనాత్మకతను చాటుకుంటూ తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

## అందాల 'జాన్వీ'.. తెలుగులో సరైన ఛాన్స్ పడితే..



స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ కోసం ఎంతో మంది హీరోయిన్లు ఎదురుచూస్తుంటారు. కానీ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కు మాత్రం టాలీవుడ్ లో తొలి రెండు ఛాన్సులు ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల పక్కన దక్కాయి. కెరీర్ పరంగా చూస్తే ఇది మంచి స్టార్టింగే. కానీ నటిగా తన టాలెంట్ ప్రూవ్ చేసుకునే విషయంలో మాత్రం ఆమె ఇంకా వెయిటింగ్ స్టేజ్ లో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దివంగత అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తెగా బాలీవుడ్ లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ట్రై చేస్తున్నారు. హిందీలో విభిన్నమైన కథలు, ఎమోషన్స్ కు ఇంపార్టెన్స్ ఉన్న రోల్స్ చేస్తూ నటిగా తన యాక్టింగ్ తో మంచి మార్కులు సంపాదించారు. అదే సమయంలో తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వరుస క్రేజీ ప్రాజెక్టులతో వచ్చారు. ఎన్టీఆర్ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన దేవరతో జాన్వీ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రంలో ఆమె తంగం పాత్రలో కనిపించారు. అయితే ఆ రోల్‌లో కథలో ఆశించిన స్థాయిలో ఇంపార్టెన్స్ లేకపోవడంతో, జాన్వీ యాక్టింగ్ ను కంప్లీట్ రేంజ్ లో చూసే అవకాశం ప్రేక్షకులకు దక్కలేదు. ఆ తర్వాత రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన పెద్దిలో ఆమె అచ్చియమ్మ రోల్ చేశారు. ఆ సినిమాపై కూడా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. దీంతో జాన్వీ రోల్స్ సెలక్షన్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662